నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, మంగళవారం 1 అక్టోబర్ 2024 YADADRI BHUVANAGIRI

## బీబీనగర్ ఎయిమ్స్‌లో ఫౌండేషన్ కోర్సు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్, సెప్టెంబర్ 30 : మండలంలోని బీబీనగర్ ఎయిమ్స్ ఆధ్వర్యంలో ఎంబీబీఎస్, బీఎస్సీ నర్సింగ్, ఎమ్మెస్సీ నర్సింగ్ 2024 విద్యార్థులకు ఎస్ఓఏ (శిక్ష ఓ అనుసంధాన్) యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఏకే మహాపాత్ర సమక్షంలో ఫౌండేషన్ కోర్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభ్యాసం అనేది జీవిత కాలం ప్రక్రియ అని, విద్యార్థులు క్రమశిక్షణతో నేర్చుకోవాలని అన్నారు. వైద్య విద్య ప్రయాణంలో ఎన్నో సవాళ్లు ఎదురవుతాయని, వాటిని ఎదుర్కోవడానికి కొత్తగా చేరిన విద్యార్థులు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు అపర్ణ, జార్జ్ డిసౌజా, డీన్ రీసెర్చ్ సంగీత సంపత్, మెడికల్ సూపరింటెండెంట్ అభిషేక్ అరోరా పాల్గొన్నారు.



రామన్నపేటలో నిర్వహించిన రైతు ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

# రైతన్నకు మొండిచెయ్యి

## రుణమాఫీ అందని రైతులెందరో! | నేటికీ జాడలేని రైతు భరోసా



## వానకాలం అవస్థల ఎవుసం

- కొత్త రుణాలూ అరకొరే
- సాగర్‌లో నీళ్లున్నా సాగునీటికి కటకట
- రైతన్నను వెంటాడుతున్న ప్రభుత్వ వైఫల్యాలు
- ముగిసిన వానకాలం... నేటి నుంచి యాసంగి షురూ...

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : వ్యవసాయంలో రైతులకు వానకాలం సీజన్ కీలకం. తరితోపాటు మెట్ట పంటలతో భూములన్నీ సాగులోకి వస్తాయి. ఏప్రిల్‌లో భూములను చదును చేయడం, ఆ తర్వాత దుక్కులు దున్నడంతో మొదలయ్యే వానకాలం సీజన్ సెప్టెంబర్‌తో ముగుస్తుంది. అక్టోబర్ నుంచి యాసంగి సీజన్ మొదలవుతుంది. సోమవారంతో వానకాలం సీజన్ ముగిసినా వ్యవసాయంలో కీలకమైన సాగునీటి విడుదల, రైతు భరోసా, రుణమాఫీ, కొత్త రుణాల జారీ వంటి విషయాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మొండి చెయ్యి చూపింది. గతంలో కేసీఆర్ సర్కార్‌లో రైతుల అవసరాలకు తగ్గట్లుగా ప్రభుత్వం ఎంతో తోడ్పాటును అందించింది. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారు మాటలకే పరిమితమై క్షేత్రస్థాయిలో రైతుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### అందని రైతు భరోసా

వ్యవసాయాన్ని పండుగలా మార్చాలన్న ఉద్దేశ్యంతో కేసీఆర్ సర్కార్ 2018 వానకాలం సీజన్ నుంచి రైతుబంధు పేరుతో పెట్టుబడి సాయానికి శ్రీకారం చుట్టింది. తొలుత ఎకరాకు రూ.4వేల చొప్పున ప్రారంభించి తర్వాత రూ.5వేలకు పెంచింది. ఏటా రెండు సీజన్లల్లో రైతుబంధు డబ్బును నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తూ వచ్చింది. 2023 వానకాలంలో పట్టాదారు పాస్‌పుస్తకం ఉన్న ప్రతి రైతుకూ ఎకరాకు రూ.5వేల చొప్పున పెట్టుబడి సాయం అందించింది. వరుసగా 11వ సీజన్... గత వానకాలంలో ఉమ్మడి జిల్లాలోని 11లక్షల మంది రైతులకు రూ.1,300 కోట్లను పెట్టుబడి సాయంగా వారి ఖాతాల్లో జమ చేసింది. గతేడాది జూన్ 26 మొదలు చివరి రైతు వరకు సాయం అందించింది. క్రమం తప్పకుండా రైతుబంధు డబ్బు జమ చేయడంతో రైతులు సాగులో నిలదొక్కుకోగలిగారు. 2014.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి ఉమ్మడి జిల్లాలో 13లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగు అయ్యేవి. పెట్టుబడి సాయంగా ఇచ్చే రైతుబంధుకుతోడు నిరంతర ఉచిత విద్యుత్, సాగునీటి కల్పనకు కేసీఆర్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడంతో 22లక్షల ఎకరాలకు సాగు విస్తీర్ణం పెరిగింది. కాగా, ఇప్పుడు పంటల సాగు ఆరంభంలో కీలకమైన రైతు బంధుపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష గట్టినట్లు వ్యవహరిస్తున్నది. రైతుబంధును రైతుభరోసాగా పేరు మార్చి ఎకరాకు వచ్చే సాయాన్ని కూడా 7,500 రూపాయలకు పెంచుతామని ప్రకటించినా.. వానకాలం సీజన్ ముగిసే వరకు కూడా అందించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన ప్రకారం రైతుభరోసా అందిస్తే రూ.2వేల కోట్లకు అటూఇటుగా రైతులకు దక్కేవి. ఇప్పుడు యాసంగి సీజన్ కూడా షురూ అవడంతో అసలు రైతుభరోసా ఇస్తారో, లేదోనన్నది ప్రశ్నార్థకంగా మారింది.

### సగంలోనే నిలిచిన రుణమాఫీ

కాంగ్రెస్ సర్కార్ ఆర్భాటంగా ప్రకటించిన 2లక్షల రుణమాఫీ సగంలోనే నిలిచిపోయింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 6 లక్షల మంది రైతులు రుణమాఫీకి అర్హులుగా ఉంటారని అంచనా వేసినా, ఆచరణలో మాత్రం 3.39లక్షల మందికే వర్తింపజేశారు. ఇంకా రెండున్నర లక్షల మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. చెప్పులు అరిగేలా అధికారులు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. రేషన్ కార్డు ప్రమాణికంగా తీసుకోవడంతో అర్హులైన రైతులెందరో రుణమాఫీకి దూరమయ్యారు. రుణమాఫీ కానీ రైతులకు భరోసా ఇచ్చే వారే కరువయ్యారు. రేషన్‌కార్డు లేని వారి విషయంలో కుటుంబ నిర్ధారణ సర్వే పేరుతో నెలన్నర రోజులుగా కాలయాపన చేస్తున్నారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంకు అకౌంట్ నెంబర్లల్లో తప్పుల సవరణ, పేర్లలో తేడాల సవరణతోనూ వేలాది మంది రైతు బంధుకు దూరమయ్యారు. వారి వివరాల సేకరణ ఎప్పుడన్నది ప్రభుత్వం చెప్పడం లేదు. దాంతో రైతులంతా తీవ్ర ఆగ్రహంతో ఉమ్మడి జిల్లా అంతటా ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. ఇదే సమయంలో గతంలో కేసీఆర్ సర్కారు లక్ష రుణమాఫీలో భాగంగా ఉమ్మడి జిల్లాలో రూ.99,999 వరకు రుణమాఫీ చేసిన విషయం తెలిసిందే. ఆ మేరకు 4.08 లక్షల మంది రైతులకు రూ.2,159 కోట్లను రుణమాఫీ చేసింది. కానీ నేటి కాంగ్రెస్ సర్కార్ 2 లక్షల వరకు రుణమాఫీ చేసినా రైతుల సంఖ్య 3.39లక్షలకు దాటకపోవడం గమనార్హం. దాంతో మిగతా వారికి రుణమాఫీ ఎప్పుడన్నది తెలియని పరిస్థితి నెలకొంది.

### కొత్తగా పంట రుణాలేవి?

వానకాలంలో సీజన్‌లో ప్రభుత్వ తీరుతో బ్యాంకులు కూడా తీవ్ర అయోమయంలో పడ్డాయి. రుణమాఫీపై స్పష్టత లేకపోవడంతో బ్యాంకులు రైతులకు కొత్తగా పంట రుణాలు ఇవ్వడంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. దాంతో వార్షిక రుణ ప్రణాళికలో సగం మాత్రమే పంట రుణాలు రైతులకు అందాయి. వాటిల్లోనూ చాలా వరకు రుణమాఫీ జరిగిన రైతులకే కొత్త రుణాలు ఇచ్చాయి. రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్న రైతుల్లో మెజార్టీ భాగం కొత్తగా పంట రుణాలకు నోచలేదు. ఓవైపు పెట్టుబడి సాయంగా అందాల్సిన రైతు భరోసా డబ్బులు రాక... కొత్తగా పంట రుణాలు లేక రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లీడ్‌బ్యాంక్ అధికారుల లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో రూ.18,469 కోట్ల పంట రుణాలకు గానూ కేవలం రూ.9,100 కోట్ల మేరకే జారీ చేశారు. లక్ష్యంలో 50 శాతమే కొత్త పంట రుణాలు అందాయి. ఎన్నో ఆశలు పెట్టుకున్న రుణమాఫీ కాక, రెగ్యూలర్‌గా రావాల్సిన రైతుభరోసా అందక, కొత్త పంట రుణాలు లేక వానకాలం అంతా రైతులకు నిరాశే మిగిలింది.

### సాగునీటికి తప్పని రణం

ప్రకృతి కరుణించి కృష్ణానది ఉప్పొంగినా ఆ నీటిని సాగు అవసరాలకు మళ్లించడంలోనూ ప్రభుత్వం వైఫల్యం కొట్టిచ్చినట్లు కనిపించింది. నిత్యం సాగునీటి కోసం రైతుల చేసిన ఆందోళనలే అందుకు సాక్ష్యం. నాగార్జునసాగర్ నుంచి వందల టీఎంసీల నీరు సముద్రంలో కలిసినా సాగర్ ఎడమ కాల్వతోపాటు ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ, వరద కాల్వల పరిధిలోని ఆయకట్టు చివరి భూములు సాగునీటికి నోచలేదు. ఎడమ కాల్వకు గండ్లు పడడంతో పలు దఫాలుగా నీటి విడుదల నిలిచిపోయి అనేకచోట్ల పంటలు ఎండిపోయాయి. మేజర్ల కింద చివరి భూములకు సైతం ఆరంభంలో నీరు పారలేదు. మరోవైపు ఏఎమ్మార్పీలో నాలుగు మోటార్లకు గానూ మూడే పని చేశాయి. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఒక మోటార్ సీజన్ మొత్తం రిపేర్‌లోనే ఉండడంతో కీలకమైన డి-37, 39, 40 డిస్ట్రిబ్యూటరీ పరిధిలోని చెరువులు, కుంటలకు నీళ్లు చేరలేదు. 80 వేల ఎకరాలకు నీరు అందించాల్సిన వరద కాల్వ ఆయకట్టులో సైతం నిత్యం రైతుల ఆందోళనలే సాగాయి. ఆయకట్టు చివరలోని మాడ్గులపల్లి, తిప్పర్తి మండలాల్లోని 30వేల ఎకరాల్లో అరకొరగా నీరు అందింది. దాంతో పండ్ల తోటలు, వరి సాగుకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. స్థానికంగా చెప్పుకోదగిన వర్షాలు లేకపోవడంతో కాల్వల ద్వారా సాగునీటి కోసం రైతులు అవస్థ పడ్డారు. ప్రభుత్వం వైపు పర్యవేక్షణ లోపం, జిల్లా మంత్రుల పట్టింపులేనితనంతో రైతులు సాగు నీటి కోసం తండ్లాడాల్సి వచ్చింది.

## రుణమాఫీ బేషరతుగా అమలుచేయాలి

- హామీలను విస్మరించిన కాంగ్రెస్ సర్కారును నిలదీయాలి
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- రామన్నపేటలో రైతు ధర్నా

రామన్నపేట, సెప్టెంబర్ 30 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్టు రైతు రుణమాఫీని బేషరతుగా అమలు చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. హామీలను విస్మరించిను కాంగ్రెస్ కాంగ్రెస్ సర్కారును ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. రామన్నపేట మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. డిసెంబర్ 9నాటికి రెండు లక్షలల్లోపు పంట రుణాలన్నింటినీ మాఫీ చేస్తానన్న రేవంత్ సర్కారు తొమ్మిది నెలలైనా అమలు చేయకుండా రైతులను మోసం చేసిందన్నారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తానని అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకోనందుకు గన్‌పార్క్‌వద్ద ముక్కునేలకు రాసి సీఎం పదవికి రాజీనామా చేయాలన్నారు. రైతు సంక్షేమం కోసం పాటుపడిన కేసీఆర్ సర్కార్‌ను కాదని కాంగ్రెస్‌కు ఓటేసిన అన్నదాతలు ఇబ్బందులు బాధ పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో స్థానిక ఎన్నికలకు గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు ముఖం చాటేసుకుని పోతున్నారని పేర్కొన్నారు. అధికారంలో లేమని బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడవద్దని, ప్రతి కార్యకర్తకూ పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్, ధాన్యానికి బోనస్ అమలు చేసే వరకు రైతుల పక్షాన బీఆర్ఎస్ కార్యకర్తలు పోరాడాలని కోరారు. ధర్నా అనంతరం ర్యాలీగా వెళ్లి తాసీల్దార్ లాల్ బహదూర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్లు బందెల రాములు, కంభంపాటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు ఎడ్ల మహేందర్‌రెడ్డి, బత్తుల శంకరయ్య, కోళ్ల స్వామి, బందెల యాదయ్య, మాజీ ఎంపీటీసీలు వేమవరపు సుధీర్ బాబు, గొరిగె నర్సింహ్మా, సాల్వేరు అశోక్, దోమల సతీశ్, ఉమారమేశ్, పున్న వెంకటేశం, రైతు సంఘం మాజీ మండలాధ్యక్షుడు బొక్క మాధవరెడ్డి, నాయకులు కన్నెబోయిన బలరాం, ఎస్కే చాంద్, బత్తుల వెంకటేశ్, జాడ సంతోశ్, మిర్యాల మల్లేశం, కూనూరు ముత్తయ్య, బండ శ్రీనివాస్‌రెడ్డి, ఆవుల నరేందర్, గర్దాసు విక్రమ్, రామిని లక్ష్మణ్, బాలగోని శివ, మామిండ్ల అశోక్, మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, పులిపలుపుల వీరస్వామి, గుండాల రాంబాబు, పున్న వెంకటేశ్, ఆవుల శ్రీధర్ పాల్గొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతు కె. జెండగే

## ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దు

- కలెక్టర్ హనుమంతు కె. జెండగే

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 30 : ప్రజావాణిలో అందిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతు కే జెండగే అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి ప్రజల నుంచి 55 అర్జీలను స్వీకరించారు. అందులో రెవెన్యూ శాఖకు 35, ఉపాధి కల్పనకు 7, పంచాయతీ అధికారి 6, జిల్లా వ్యవసాయ శాఖకు 2, మున్సిపాలిటీ, శిశు సంక్షేమ, అటవీ, కో-ఆపరేటివ్, బీసీ సంక్షేమ శాఖ సంబంధించి ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు ఉన్నాయి. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే గంగాధర్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్, జిల్లా ముఖ్య కార్యనిర్వహణ అధికారి శోభారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, కలెక్టరేట్ పరిపాలనాధికారి జగన్‌మోహన్‌ప్రసాద్, సూపరింటెండెంట్ రవికుమార్ పాల్గొన్నారు.

## రైతులు వ్యవసాయ నిపుణుల సూచనలు పాటించాలి

- జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త అనిల్‌కుమార్



రైతు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త అనిల్‌కుమార్

మోత్కూరు, సెప్టెంబర్ 30 : రైతులు వ్యవసాయ నిపుణుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.అనిల్‌కుమార్ అన్నారు. వాతావరణంలోని మార్పుల వల్ల వరి, పత్తి పంటలకు తెగుళ్ల బెడద ఎక్కువైందని తెలిపారు. మండలంలోని పాటిమట్ల రైతు వేదికలో వ్యవసాయ శాఖ, జాతీయ మొక్కల ఆరోగ్య యాజమాన్య సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో ఏరోజుకారోజు మార్పులు వస్తున్నాయన్నారు. వానకాలంలోనూ ఎండల వేడి, ఉక్కపోత కారణంగా పత్తి, ఇతర పంటలకు కొత్త కొత్త తెగుళ్లు సోకుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం పత్తి పంటలో జాజు రోగం విపరీతంగా వ్యాప్తి చెంది పంట దిగుబడులపై ప్రభావం చూపుతుందన్నారు. దీని నివారణకు 13.0.45 లేదా 19.19.19, ఆగ్రోమిన్ మ్యాక్స్ పిచికారీ చేయాలని సూచించారు. జాతీయ మొక్కల ఆరోగ్య యాజమాన్య సంస్థ వ్యవసాయ సహాయ సంచాలకులు డాక్టర్ బి.జ్యోతి మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులకు సరైన ధర లేనప్పుడు రైతులు తమ పంటలను గిడ్డంగుల్లో నిల్వ చేసుకొని రుణాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ డి.పద్మావతి, ఏఓ వి.కీర్తి, వ్యవసాయ విస్తరణ అధికారులు ఎం.అశోక్‌కుమార్, టి.గోపీనాథ్, ఎ.వేణు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్


## రాచకొండలో అనర్హుల భూ పట్టాలను రద్దు చేస్తాం

- అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 30 : రాచకొండ ప్రాంతంలోని సర్వే నెం.273లో అనర్హులు పట్టాలు పొందారని, వాటిని రద్దు చేసి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేస్తామని రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్ అన్నారు. స్థానిక తాసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ శేఖర్‌రెడ్డితో కలిసి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని 255 సర్వే నెంబర్‌లో గల ప్రభుత్వ భూమిని పోలీస్ బెటాలియన్‌కు కేటాయించామని, అసైన్డ్ భూమిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని అన్నారు. తాసీల్దార్ కార్యాలయంలో 132 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, అందులో 80 వరకు డేటా కరక్షన్, పీఓబీ అప్లికేషన్లు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో తాసీల్దార్ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## డీఎస్సీ 2024 ఫలితాలు విడుదల

### జిల్లావారీగా ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ సబ్జెక్టుల్లో ర్యాంకులు



- నేటి నుంచి ఈ నెల 5 వరకు డైట్‌లో 1:3లో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భర్తీ కానున్న 1,268 టీచర్ పోస్టులు
- నల్లగొండలో 605, సూర్యాపేటలో 386, యాదాద్రిలో 277 ఖాళీలను వెల్లడించిన విద్యాశాఖ
- ఫలితాలు చూసుకునేందుకు వెబ్‌సైట్ సర్వర్ పని చేయక టెన్షన్ పడ్డ అభ్యర్థులు

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 30: డీఎస్సీ 2024 పరీక్షల ఫలితాలను సోమవారం విద్యాశాఖ, ప్రభుత్వం విడుదల చేశాయి. తొలిసారి రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో జూలై, ఆగస్టు 2024లో పరీక్షలు నిర్వహించగా, ఫలితాలు విడుదల సమయంలో అభ్యర్థులు ఉత్కంఠగా ర్యాంకులను చూసుకున్నారు. సోమవారం మధ్యాహ్నమే ఫలితాలు విడుదలైనా, అధికారిక వెబ్‌సైట్ సర్వర్ పని చేయకపోవడంతో అభ్యర్థులు ఇబ్బంది పడ్డారు. ఈసారి జిల్లాల వారీగా ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలోని సబ్జెక్టుల వారీగా వేర్వేరుగా ర్యాంకులు ప్రకటించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా 1,268 పోస్టులు భర్తీ కానుండగా.. వాటిలో నల్లగొండ జిల్లాలో 605, సూర్యాపేటలో 386, యాదాద్రి భువనగిరిలో 277 ఉన్నాయి.

### ఉమ్మడి జిల్లా పరిశీలకుడిగా రమణకుమార్

డీఎస్సీ 2024 సర్టిఫికెట్ల పరిశీలనలో భాగంగా నల్లగొండ ఉమ్మడి జిల్లా పరిశీలకులుగా టీఆర్ఈఎస్ఐ కార్యదర్శి, టెక్స్‌బుక్స్ డైరెక్టర్ సీహెచ్ రమణకుమార్‌ను ప్రభుత్వం నియమించింది. సర్టిఫికెట్ పరిశీలన సవ్యంగా సాగేలా ఈయన పర్యవేక్షించనున్నారు. సూర్యాపేట జిల్లా అభ్యర్థులకు సం బంధించి వెరిఫికేషన్ సూర్యాపేట కలెక్టరేట్‌లోని రెండో అంతస్తు రూమ్ నెంబర్ 26లో ఉంటుందని డీఈఓ అశోక్ తెలిపారు.

యాదాద్రి భువనగిరి జిల్లాకు సంబంధించిన అభ్యర్థుల వెరిఫికేషన్ భువనగిరిలోని వెన్నెల కళాశాల ఉంటుందని డీఈఓ సత్యనారాయణ తెలిపారు.

### జిల్లాల వారీగా భర్తీ చేయనున్న పోస్టులు..

| జిల్లా | మొత్తం పోస్టులు | స్కూల్ అసిస్టెంట్ | ఎస్జీటీ |
|---|---|---|---|
| నల్లగొండ | 605 | 232 | 373 |
| సూర్యాపేట | 386 | 173 | 213 |
| యాదాద్రి | 277 | 142 | 135 |

### ఫస్ట్ ర్యాంకు సాధించిన చంద్రకళ



మొదటి ర్యాంక్ సాధించిన గుర్రం చంద్రకళ

సంస్థాన్ నారాయణపురం : డీఎస్సీ ఎస్జీటీ ఫలితాల్లో సంస్థాన్ నారాయణపురం మండలానికి చెందిన యువతులు సత్తా చాటారు. మండల కేంద్రానికి చెందిన గుర్రం చంద్రకళ 100 మార్కులకు గానూ 83 మార్కులతో యాదాద్రి భువనగిరి జిల్లా మొదటి ర్యాంకు సాధించారు. పొర్లగడ్డతండాకు చెందిన ఉదవాత్ ఇందిర 10, చిలువేరు మౌనిక 14, బొడ్డుపల్లి మాలతి 66వ ర్యాంకు సాధించారు.

### మల్లాపురంవాసికి సెకండ్ ర్యాంక్



స్కూల్ అసిస్టెంట్ బయాలజీలో జిల్లా స్థాయి 2వ ర్యాంక్ సాధించిన గిరెడ్డి బుచ్చిరెడ్డి

మోటకొండూర్ : స్కూల్ అసిస్టెంట్ బయాలజీలో యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం గ్రామానికి చెందిన గిరెడ్డి బుచ్చిరెడ్డి జిల్లా రెండో ర్యాంకు సాధించారు. ఈయన 2009 నుంచి 2019 వరకు వివిధ పత్రికల్లో ఉపసంపాదకుడిగా పని చేశారు. ఇటీవల విడుదలైన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో యాదాద్రి జోన్ స్థాయిలో 11వ ర్యాంకు సాధించారు. గ్రూప్4 ఫలితాల్లో 1:3 సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఎంపికవడంతోపాటు గ్రూప్ 1 ప్రిలిమ్స్‌లో మెయిన్స్‌కు అర్హత పొందారు.

## గిడ్డంగుల్లో ధాన్యం నిల్వ చేస్తే అధిక లాభాలు

- జాతీయ మొక్కల ఆరోగ్య పరిరక్షణ సంస్థ జేడీ డాక్టర్ మరియాదాస్



అవగాహన సదస్సులో పాల్గొన్న రైతులు, శాస్త్రవేత్తలు

గరిడేపల్లి, సెప్టెంబర్ 30 : గిడ్డంగుల్లో ధాన్యాన్ని నిల్వ చేస్తే రైతులకు అధిక లాభాలు వస్తాయని జాతీయ మొక్కల ఆరోగ్య పరిరక్షణ సంస్థ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఏ మరియాదాస్ అన్నారు. మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో సోమవారం వేర్‌హౌస్ డెవలప్‌మెంట్ రెగ్యులేటరీ(డబ్ల్యూడీఆర్ఏ), నెగోషియబుల్ వేర్‌హౌస్(ఎన్‌డబ్ల్యూఆర్)పై రైతులు, వ్యాపారులు, పప్పు మిల్లు యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాముల్లో ధాన్యం నిల్వ చేసుకునే విధానం తోపాటు పొలంలో పంటకు హాని చేసే ఎలుకల నివారణపై అవగాహన కల్పించారు. గోదాముల్లో నిల్వ పెట్టిన ధాన్యానికి లోన్ పొందడం తోపాటు ఆన్‌లైన్‌లో విక్రయించుకునే విధానాలను వివరించారు. రైతులు ధాన్యం నిల్వలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిల్వకు ఉపయోగించాల్సిన హెర్మటిక్ బ్యాగులపై కేవీకే ఇన్‌చార్జి ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డి.నరేశ్ కల్పించారు. కార్యక్రమంలో కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డి.ఆదర్శ్, శాస్త్రవేత్తలు సీహెచ్ నరేశ్, రైతులు పాల్గొన్నారు.